క్లుప్తంగా

అగ్గిపుల్లపై నటసామ్రాట్ అక్కినేని



ఏలూరు (టూటౌన్): నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా అగ్గిపుల్లపై ఆయన చిత్రాన్ని సూక్ష్మ కళాకారుడు మేతర సురేష్ బాబు రూపొందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సినీ పరిశ్రమలో మర్చిపోలేని వ్యక్తి నాగేశ్వరరావు అని కొనియాడారు. ఆయనకు వచ్చిన అవార్డులు, పురస్కారాలు తెలుగు చిత్ర పరిశ్రమలో ఏ ఒక్కరికీ రాలేదని గుర్తు చేశారు.

మహాధర్నా పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): సామాజిక న్యాయం కోసం ఈ నెల 29న విజయవాడలో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు పిలుపు నిచ్చారు. స్థానిక అన్నే భవన్ నందు బుధవారం మహాధర్నా వాల్ పోస్టర్‌ను వ్యవసాయకార్మిక సంఘం, కేవీపీఎస్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.రవి, కేవీపీఎస్ నాయకులు మంచెల్ల ఇస్సాకు, బాలరాజు, మహిళా నాయకురాలు పి.హైమావతి, ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు



రక్తదానం చేస్తున్న బీజేపీ నాయకుడితో పురంధరేశ్వరి, నాయకులు

ఏలూరు (టూటౌన్): ప్రధాని మోదీ 73వ జన్మదినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి తెలిపారు. బుధవారం ఏలూరు విచ్చేసిన ఆమెకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. కలపర్రు టోల్ గేట్ నుంచి కార్లు, మోటారు సైకిళ్లతో సుఖీభవ కల్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరం, ఫొటో ఎగ్జిబిషన్‌ను పురంధరేశ్వరి ప్రారంభించారు. పార్టీ శ్రేణులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం ఆర్ఎంఎస్ కాలనీలో పార్టీ నాయకులు ఏర్పాటుచేసిన ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులను ఆమె పలువురు మహిళలకు అందజేశారు. కార్యక్రమాల్లో నాయకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, కోడూరి లక్ష్మీనారాయణ, నిర్మల కిషోర్, చౌటుపల్లి విక్రమ కిషోర్, శరణాల మాలతీరాణి, కొర్లపాటి సుధాకర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

22న జాతీయ చేనేత కార్మిక సంఘం సమావేశం

ఏలూరు (టూటౌన్): అఖిల భారత చేనేత కార్మిక సంఘం విస్తృత సమావేశం ఈ నెల 22న హైదరాబాద్‌లోని బాల్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్టు సంఘం జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత రిజర్వేషన్ చట్టం, జీఎస్టీని రద్దు చేయాలని, కేంద్రం చేనేతకు రూ.25 వేల కోట్లు నిధులు కేటాయించాలని, చేనేతకు ఉపయోగించే ముడి పదార్థాలు నూలు, రంగులు రసాయనాలు ధరలు తగ్గించాలనే అంశాలపై చర్చిస్తామని పేర్కొన్నారు. ప్రతి చేనేత కార్మికునికి నెలకు రూ.2 వేలు జీవన భృతి ఇచ్చి ఆదుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. సమావేశానికి జిల్లా నుంచి జిల్లా కమిటీ సభ్యులు వాసా రామలింగం, బూడిద జోగేశ్వరరావు తదితరులు హాజరు కానున్నట్టు చెప్పారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- రూ.75 లక్షల అభివృద్ధి పనులకు ఆమోదం
- ఎమ్మెల్యే ఆళ్ల నాని



మహిళలకు కుట్టుమిషన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని



ఎమ్మెల్యే నానికి వినతి పత్రం అందిస్తున్న కార్పొరేటర్ విజయనిర్మల, పార్టీ నేత రమేష్



ఆహ్వాన పత్రికను విడుదల చేసిన ఎమ్మెల్యే నాని, ధర్మకర్తల మండలి సభ్యులు

ఏలూరు టౌన్: ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ.. వారికి ఉత్తమ సేవలు అందించడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో పనిచేస్తున్నామని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంపై సమీక్షించారు. 28వ డివిజన్ తంగెళ్లమూడి 2వ సచివాలయం, 9వ డివిజన్ 58వ సచివాలయం పరిధిలో చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పలువురు మహిళలు తమ జీవనోపాధి కోసం కుట్టు మిషన్లు మంజూరు చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో వారికి ఉపాధి కల్పించేందుకు కుట్టు మిషన్లను ఎమ్మెల్యే నాని పంపిణీ చేశారు. 28వ డివిజన్‌లో రూ.40 లక్షలు, 9వ డివిజన్‌లో రూ.35 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టేలా ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేశారు. ఆయా ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టులు, ఇతర పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే నాని ఆదేశించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించటమే ప్రభుత్వం ప్రధాన అజెండా అని వివరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, కార్పొరేటర్ సబ్బన శ్రీనివాస్, పార్టీ నేతలు కొల్లిపాక సురేష్ బాబు, తోటకూర కిషోర్, నగర కమిషనర్ సంగ్రాంతి వెంకటకృష్ణ, ఏలూరు తహసీల్దార్ సోమశేఖర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

ఆక్రమణల తొలగింపునకు ఆదేశం

ఏలూరు వన్‌టౌన్ అరుంధతీపేట ఎస్సీలకు కొత్తూరు రోడ్డు లక్ష్మమ్మ కోనేరు ఎదురుగా ప్రభుత్వం కేటాయించిన శ్మశాన వాటిక స్థలంలో ఆక్రమణలను తొలగించాలని ఎమ్మెల్యే ఆళ్ల నానికి వినతి పత్రం అందజేశారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో బుధవారం 16వ డివిజన్ కార్పొరేటర్ జిజ్జువరపు విజయనిర్మల, పార్టీ నాయకులు జిజ్జువరపు రమేష్ ఆధ్వర్యంలో అరుంధతీపేట సీఎస్ఐ సంఘం, గ్రామ పెద్దలు ఎమ్మెల్యే నానిని కలిశారు. సమస్యపై ఎమ్మెల్యే నాని స్పందిస్తూ శ్మశానవాటిక స్థలం ఆక్రమణలు తక్షణమే తొలగించాలని అధికారులకు ఆదేశించారు. ఇష్టారాజ్యంగా ప్రభుత్వం కేటాయించిన స్థలాలు ఆక్రమిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానికి అరుంధతీపేట ఎస్సీలు, సీఎస్ఐ సంఘం పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

వెంకటేశ్వరస్వామి వార్షిక పవిత్రోత్సవాలు

ఏలూరు ఆర్ఆర్‌పేట వెంకటేశ్వరస్వామి 22వ వార్షిక పవిత్రోత్సవ ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే ఆళ్ల నాని బుధవారం ఆవిష్కరించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు తోలేటి శ్రీనివాస్, ఈఓ నాగం సన్యాసిరావు, ప్రధాన అర్చకులు కిలాంబి మారుతీ తదితరులు పవిత్రోత్సవాలకు ఎమ్మెల్యే నానిని ఆహ్వానించారు. నానికి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు మారుతీ రామానుజాచార్యులు ఎమ్మెల్యే నానికి వేదాశీర్వాదం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



అమీనాపేటలో విఘ్నేశ్వరుడు



పోలీస్‌లైన్‌లో గణపతి



చేపల తూము సెంటర్‌లో లంబోదరుడు



కూరగాయల వర్తక సంఘం ఆధ్వర్యంలో..

భక్తిశ్రద్ధలతో గణపతి ఉత్సవాలు



విజయవిహార్ సెంటర్‌లో 53 రకాల ప్రసాదాలు నివేదన



సత్రంపాడు లక్ష్మీగణపతి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు



గణపతి పూజ చేస్తున్న మేయర్ నూర్జహాన్ దంపతులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గణపతి నవరాత్రి మహోత్సవాలు నగరంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మూడో రోజు బుధవారం స్వామి వారికి విశేష పూజాధికాలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేశారు. హోమాలు నిర్వహించారు. సత్రంపాడులోని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో ఇటీవల ఇరువర్గాల మధ్య తలెత్తిన విబేధాల నేపథ్యంలో దేవదాయ శాఖ డిప్యూటీ కమీషనర్ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. బుధవారం గణపతి హోమం నిర్వహించారు. పోస్టల్ కాలనీ, ఎన్‌టీఆర్ కాలనీ, తూర్పులాకులు, పడమర లాకుల ప్రాంతాల్లో నిమజ్జనం చేస్తూ స్వామి వారిని గంగ ఒడికి చేర్చారు. బుధవారం రాత్రికి కూడా స్వామి వార్ల ఊరేగింపు అంగరంగ వైభవంగా కొనసాయి. తీన్‌మార్ డప్పులు, మేళతాళాలు, బాణసంచా సందడి, యువత నృత్యాలు, గణపతి బొప్పా మోరియా అంటూ నినాదాలతో స్వామి వార్ల ఊరేగింపు ఉత్సాహంగా నిర్వహించారు.

విఘ్నాలు తొలగాలి

నగర ప్రజలపై గణపతి ఆశీస్సులు ఉండాలని నగర మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు దంపతులు ఆకాంక్షించారు. వారు ఎస్ఎంఆర్ నగర్‌లో ప్రతిష్ఠించిన వినాయక స్వామి వార్ని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. విజయవిహార్ సెంటర్‌లో వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పందిరిలో స్వామివారికి నగరానికి చెందిన రవి దేవకి దంపతులు పులిహోర, పరమాన్నం, చక్రపొంగలి, కుడుములు, ఉండ్రాళ్లు, హల్వా, సున్నుండలు, సేమ్యా పాయసం, రసగుల్లా, గులాబ్‌జామ్ వంటి 53 రకాల ప్రసాదాలను నివేదించారు.

శ్రీవారి హుండీల ఆదాయం రూ.7.14 లక్షలు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. 70 రోజులకు రూ.7,14,064 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్ , ట్రస్టీలు కొండల అరుణ కుమారి, చోడే శివసాయి కృష్ణ, పలువురు శ్రీవారి సేవకులు పాల్గొనగా, అప్పనవీడు శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి కూడిపూడి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

పంటల బీమాను ప్రైవేటీకరించొద్దు



వ్యవసాయ శాఖ జేడీ రామకృష్ణకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): 2023–24 పంటల బీమాను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించవద్దని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కమిటీ కోరింది. ఈమేరకు బుధవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వై.రామకృష్ణకు రైతు సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. పంటల బీమాలో ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీల ప్రవేశం నిలిపివేయాలని కోరారు. 2023–24 ఖరీఫ్ సీజనల్‌లో పంటల బీమా అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ కంపెనీలతో బిడ్డింగ్ నిర్వహించిందని తెలిపారు. పంటల బీమా విధానం రైతులకు నష్టం చేసేదిగా, బీమా కంపెనీలకు ప్రయోజనాలకు ఉపయోగపడేదిగా ఉందని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా పాలసీ ఇన్సూరెన్స్ కంపెనీల లాభాలకే తప్పరైతుల ప్రయోజనానికి కాదని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రధాన మంత్రి ఫసల్ బీమా అమలు నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, రైతు సంఘం నాయకులు గండి రాజా, నున్న శేషగిరిరావు పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో అక్కినేని



కార్యక్రమంలో మాట్లాడుతున్న గారపాటి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సూర్య, చంద్రులు ఉన్నంత కాలం అక్కినేని నాగేశ్వరరావు ప్రజల హృదయాల్లో ఉంటారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. నగరానికి చెందిన ఘంటసాల స్వరపీఠం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి స్థానిక వైఎంహెచ్ఏ హాలులో నిర్వహించిన అక్కినేని శతవసంతాల వేడుకలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలుగు చలనచిత్రాల్లో నృత్యాలకు ఆద్యుడు అక్కినేని నాగేశ్వరరావు అని అన్నారు. ఆయన నటించిన సినిమాల్లో నృత్యాలను చేర్చి అప్పటి యువతలో హుషారు రేకెత్తించారన్నారు. ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మాట్లాడుతూ విషాద చిత్రాలకు పెట్టింది పేరు అక్కినేని అని శరన్నవల దేవదాసుకు తెరపై జీవం పోయడంతో పాటు విషాద చిత్రాల నాయకుడుగా కీర్తి గడించారని గుర్తుచేశారు. తెలుగు రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పౌరాణిక, జానపద సినిమాలతో ప్రారంభమై సాంఘిక చిత్రాల వరకు తనదైన ముద్ర వేసిన ఏకైక కథానాయకుడు అక్కినేని అన్నారు. అక్కినేని చిత్రాల్లోని అనేక పాటలు నేటికీ తెలుగు గడ్డపై ప్రతిధ్వనిస్తుండడం సంగీతంపై ఆయనకు ఉన్న మక్కువకు తార్కాణమన్నారు. పలువురు గాయకులు అక్కినేని నటించిన గీతాలను ఆలపించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. కార్యక్రమంలో ఘంటసాల స్వరపీఠం వ్యవస్థాపకులు ఎస్ఎం సుభాని, గౌరవాధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వర రావు, అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వర రావు, నిర్వహణ కమిటీ ప్రతినిధులు ఈటీ అర్జున రావు, సీహెచ్ సురేంద్ర మోహన రావు, పి.సూర్య ప్రకాష్, ఎండీ ఖాజీ వలీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే బీసీలకు గుర్తింపు



గంటా ప్రసాదరావు

ఏలూరు(మెట్రో): రాష్ట్రంలో బీసీలను గుర్తించిన ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంటా ప్రసాదరావు అన్నారు. బుధవారం ఆయన తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. టీడీపీ దెందులూరు నాయకుడు అశోక్‌గౌడ్ తన నోరు అదుపులో పెట్టుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. తోబుట్టువులను మోసం చేసి దాడి చేసిన నీచమైన చరిత్ర కలిగిన టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీ మిథున్‌రెడ్డిని విమర్శించడం నీతిమాలిన చర్యని అన్నారు. సభా మర్యాదలు పాటించకుండా లోక్‌సభలో మిథున్‌రెడ్డి ప్రసంగానికి అడ్డుపడ్డ నేపథ్యంలో శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్‌నాయుడును మిథున్ రెడ్డి సముదాయించారని, దీనిని కూడా పార్టీ ప్రయోజనాలకు వాడుకునేందుకు ప్రయత్నించడం టీడీపీ నాయకుల దిగజారుడుతనానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. రాష్ట్ర కేబినెట్‌లో 11 మందిని మంత్రులుగా, 18 మందిని ఎమ్మెల్సీలుగా బీసీలకు స్థానం కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని, వైఎస్సార్ సీపీని, వైఎస్సార్ సీపీ నాయకులను విమర్శిస్తే చూస్తూ ఊరుకోమని టీడీపీ నాయకులను హెచ్చరించారు. సమావేశంలో పామర్తి అచ్యుత్‌గౌడ్, ఎస్ కిషోర్, కె.ఏ సుబాబు, ఎం.రెడ్డియ్య, పి.నాగబాబు, బి.నర్సింహ రావు, పి.తాతయ్య, ఎస్ తిలక్ పాల్గొన్నారు.

'విశ్వకర్మ'లో ఇండస్ట్రియల్ టూర్ చేర్చాలి



పురంధరేశ్వరికి వినతి పత్రం అందిస్తున్న శివశ్రీ

ఏలూరు (టూటౌన్): ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంలో ఇండస్ట్రియల్ టూర్‌ను చేర్చి, ఆధునిక ఉత్పత్తులు, ఆధునిక యంత్ర వినియోగంపై హస్త కళాకారులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరిని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి అప్పలభక్తుల శివ కేశవరావు (శివశ్రీ) కోరారు. ఏలూరు పర్యటనకు విచ్చేసిన సందర్భంగా పురంధరేశ్వరి, రాష్ట్ర కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరికి వినతి పత్రం అందజేశారు. ప్రధాని మోదీ విశ్వకర్మ యోజన పథకం ప్రవేశపెట్టడంపై ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విశ్వకర్మచే సృష్టించిన ఐదు హస్తకళలు, అయో శిల్పం (బ్లాక్‌స్మిత్), దారు శిల్పం (కార్పెంటరీ), తామ్రశిల్పం (బ్రాసరి), శిలా శిల్పం (స్టోన్ కార్వింగ్), స్వర్ణ శిల్పం (గోల్డ్‌స్మిత్) విశ్వబ్రాహ్మణుల వంశపారంపర్యంగా ఉన్నాయని తెలిపారు. ఈ ఐదు ప్రధాన వృత్తులతో పాటు దీనిపై ఆధారపడి ఉన్న 13 ఉప వృత్తిదారులకుసైతం ప్రయోజనం చేకూరేలా సీఎం విశ్వకర్మ యోజన పథకానికి రూపకల్పన చేయడం తమకు ఎంతో ప్రోత్సాహకంగా ఉంటుందన్నారు. అయితే ఈ పథకంలో కొన్ని సవరణలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు శిల్పుల వైభవం గ్రంథాన్ని పురంధరేశ్వరికి బహూకరించారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

భీమడోలు: ధ్యానంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ జిల్లా సీనియర్ పిరమిడ్ మాస్టర్ రాధా.జోసులా అన్నారు. భీమడోలులో బుధవారం పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ నిర్వాహకులు జి.అప్పన్న ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. వివిధ గ్రామాల నుంచి హాజరైన పిరమిడ్ సొసైటీ సభ్యులు శ్వాసపై పట్టు సాధించేందుకు ఆమె శిక్షణా తరగతులను నిర్వహించారు. ధ్యానానికి అవసరమైన యోగాసనాలను వివరించారు. జోసులా మాట్లాడుతూ నిజజీవితంలో మనిషి ఒత్తిళ్లకు గురై అనేక రోగాలతో పాటు మానసిక ప్రశాంతతను కోల్పోతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో ధ్యానం ఒక అలవాటుగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు పచ్చా వెంకటేశ్వరరావు, పంట్ల రాము, పెన్నింటి అప్పారావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

భీమడోలు: తాగునీటి సమస్య పరిష్కారానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని భీమడోలు ఎంపీపీ కనమాల రామయ్య అన్నారు. పూళ్ల పంచాయతీ పరిధిలోని ఎంఎంపురం గ్రామంలో మంచినీటి ఫిల్టర్ బెడ్స్ పాడైన నేపథ్యంలో ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు చొరవతో మండల పరిషత్ నిధులు రూ.5లక్షలు మంజూరు చేసారు. ఆ నిధులతో ఫిల్టర్ బెడ్స్ మరమ్మతులు చేశారు. ఈ నేపథ్యంలో వాటిని బుధవారం ఎంపీపీ కనమాల రామయ్య, సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్‌లు నీటిని విడుదలచేశారు. ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ పెద్దిరెడ్డి హరి బ్రహ్మనాయుడు, గ్రామకార్యదర్శి సూర్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మేరీమాత ఆలయ వార్షికోత్సవం

పెదవేగి : పెదవేగిలోని మేరీమాత ఆలయ 13వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. న్యాయంపల్లి విచారణ గురువు ఫాదర్ రాచూరి బాలస్వామి ఆధ్వర్యంలో సంఘ కాపరి బొబ్బూరి రవికుమార్ సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహిళలు హాజరయ్యారు. మాల మహాసేన జిల్లా కార్యదర్శి మద్దుల స్వామిదాసు, సంఘస్తులు, విశ్వాసులు పాల్గొన్నారు.

వాహనచోదకులకు జరిమానా

భీమడోలు: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఏడుగురు మందుబాబులను పోలీసులు అదుపులోకి తీసుకుని బుధవారం భీమడోలు కోర్టులో హాజరుపర్చారు. వారికి భీమడోలు మేజిస్ట్రేట్ టీఏఎస్ఎస్ఆర్‌కే ఆదిత్య ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై చావా సురేష్‌కుమార్ తెలిపారు.